నేడు డయల్ యువర్ డీఎం

రాజేంద్రనగర్: ఈ నెల 31న బుధవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రాజేంద్రనగర్ డిపో మేనేజర్ బద్రి నారాయణ తెలిపారు. ఈ సదవకాశాన్ని రాజేంద్రనగర్ పరిసర ప్రాంతాల్లోని ప్రజలు, ఆర్టీసీ బస్సు ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రయాణికులకు తమ ఫిర్యాదులను 9959226135 నంబర్‌లో తెలియజేయాలన్నారు.

వైభవంగా ఫలహారం బండి ఊరేగింపు



ఫలహారం బండి ఊరేగింపులో పాల్గొన్న నాయకులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్ గ్రామంలో సోమవారం డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చేవెళ్ల మాజీ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, జీహెచ్ఎంసీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ముదిరాజ్ కోఆపరేటివ్ సొసైటీ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌లు పాల్గొన్నారు. పోతరాజులు, శివసత్తులు, కళాకారులు, డప్పులతో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ భూపాల్‌గౌడ్, ప్రశాంత్‌నాయక్, కార్పొరేషన్‌లోని నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలి



డ్రైనేజీ పరిశుభ్రత పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: కార్పొరేషన్ పరిధిలోని 13వ డివిజన్‌లోని వెస్టెండ్ కాలనీ, 14వ డివిజన్‌లోని పీరంచెరువులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించడం జరుగుతుందని, డ్రైనేజీలు నిండుకోకుండా ఎప్పటికప్పుడు సిబ్బంది డ్రైనేజీలను శుభ్రం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్ సావిత్రి, అరుణ్, సంతోష్, గోపాల్, రమేష్ తదితరులున్నారు.

ఘనంగా జన్మదిన వేడుకలు



శుభాకాంక్షలు తెలిపిన జ్ఞానేశ్వర్, జైపాల్‌రెడ్డి తదితరులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జి. విజయ్‌బాబు జన్మదిన వేడుకలను మంగళవారం రాత్రి కోకాపేటలో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ముదిరాజ్ కోఆపరేటీవ్ సొసైటీ చైర్మన్ బి. జ్ఞానేశ్వర్, టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ.. ప్రజలతో అనునిత్యం కలిసి ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఇలాంటి జన్మదినోత్సవాలు మరిన్ని జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, వేణుగౌడ్, రాము, ఓం ప్రకాష్‌రెడ్డి, జి.కుమార్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ పనులు ఆపండి



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న గండిపేటవాసులు

మణికొండ: విశాలంగా ఉన్న శ్మశానవాటికను ఇరుకుగా చేసి నిర్మాణం చేస్తున్న ప్రహరీగోడ పనులను వెంటనే నిలిపివేయాలని నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌యాదవ్ ఆధ్వర్యంలో గండిపేట వాసులు మున్సిపల్ కమిషనర్ టి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని కోరారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆయనను కలిసి శ్మశాన వాటికి స్థలం రోజురోజుకు ఎలా తగ్గిపోతుందో వివరించారు. పక్కన ఉన్న విల్లాల వారికి శ్మశానవాటిక కనిపిస్తుందనే ఉద్దేశంతో మున్సిపల్ నిధులతో ప్రహరీ నిర్మించటం ఏమిటని అడిగారు. విల్లాల నిర్మాణం కానప్పటి నుంచి అక్కడ శ్మశాన వాటిక ఉందని, అలాంటి చోట విల్లాలు కొని ఇప్పుడు ప్రజల డబ్బుతో వారికి సౌకర్యాలను కల్పించటం ఏంటని ప్రశ్నించారు. గండిపేట నాయకులు గోపాల గణేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మనెంట్ చేయాలి

రాజేంద్రనగర్: తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరాపార్కు వద్ద ధర్నాను నిర్వహించారు. ఈ ధర్నాకు రాజేంద్రనగర్ సర్కిల్‌కు చెందిన కార్మికులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం సర్కిల్ కార్యాలయం నుంచి ర్యాలీకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో అన్ని రంగాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలన్నారు. పర్మనెంట్ చేసేంతవరకు కార్మికులందరికి కనీస వేతనాలు రూ.26 వేలు అమలు చేయాలన్నారు. పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులకు ఫేస్ స్కానర్ హాజరు పేరుతో కార్మికుల జీతాలకు కోతలు విధిస్తున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పారిశుద్ధ్య కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడి కనీస వేతనాలు అమలు చేసేలా నిర్ణయం తీసుకోవాలన్నారు.


పేకాట ఆడుతున్న 8 మంది అరెస్టు

శంషాబాద్ రూరల్: మండలంలోని మదన్‌పల్లిలో అరుణ్‌కుమార్‌కు చెందిన ఫాంహౌజ్‌లో సోమవారం రాత్రి కొంత మంది పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు ఫాంహౌజ్‌పై దాడి చేశారు. పేకాట ఆడుతున్న రాంచందర్‌రాజు, స్వామి, రమేష్, దశరథ, రాజు, హన్మంతు, నందం, సత్యంను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డ 8 మంది నుంచి రూ.1,20,250 నగదును స్వాధీనం చేసుకున్నారు.

చిన్నపాటి వర్షానికే.. భారీ ట్రాఫిక్

వందల సంఖ్యలో నిలిచిపోయిన వాహనాలు

- నానా అవస్థలు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు



ప్రధాన రహదారిపై నిలిచిపోయిన ట్రాఫిక్

మైలార్‌దేవ్‌పల్లి: చిన్న పాటి వర్షానికి రహదారులపై నీరు నిలువడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అవుతున్నాయి. మంగళవారం సాయంత్రం కురిసిన 30 నిమిషాల వర్షానికి మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని దుర్గానగర్ నుంచి ఆరాంఘర్ వరకు వందల సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. వర్షం పడిని ప్రతి నిత్యం నరకయాతన అనుభవిస్తున్నామని, దుర్గానగర్ నుంచి ఆరాంగర్ వెళ్లడానికి అర గంట సమయం పడుతుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారిపై వాహనాలు నిలిచిపోతే ఎమర్జెన్సీ అంబులెన్స్ వాహనం వస్తే చాలా ఇబ్బందులు ఎదుర్కొవల్సి వస్తుందని వాపోతున్నారు. భారీగా ట్రాఫిక్ జామ్ అయినప్పటికి ట్రాఫిక్ పోలీసులు నిమ్మకు నీరెక్కినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

డిపోలో ముగిసిన ప్రమాద రహిత వారోత్సవాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ నర్సింహులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డిపోలో ప్రమాద రహిత వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇన్‌స్పెక్టర్ నర్సింహులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెల్ ఫోన్లు, మద్యం సేవించి వాహనాలను నడపకూడదని, ఆర్టీసీ బస్సు డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ ప్రయాణికులను సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. డిపోలో గత 29 సంవత్సరాలుగా ఒక్క ప్రమాదం చేయకుండా ఫ్రీ డ్రైవర్‌గా మొదటి స్థానంలో నిలిచిన మహ్మద్ హమీద్, 28 ఏళ్లుగా ప్రమాదం చేయకుండా ప్రమాద యాక్సిడెంట్ ఫ్రీ డ్రైవర్‌గా రెండో స్థానంలో నిలిచిన జి.సురేందర్, 27 ఏళ్లుగా ప్రమాదం చేయకుండా యాక్సిడెంట్ ఫ్రీ డ్రైవర్‌గా మూడో స్థానంలో నిలిచిన బి.ఎస్. రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రవీందర్ రెడ్డి, రాజేంద్రనగర్ డిపో మేనేజర్ బద్రి నారాయణ, అసిస్టెంట్ మేనేజర్ రవి కుమార్, మెకానికల్ ఇంజనీర్ నీలిమా, ఎస్‌టీఐ సుశీల పాల్గొన్నారు.

సత్కారం



ఏసీపీ అబ్దుల్ ఖాదర్‌ను సన్మానిస్తున్న డీసీ రవి కుమార్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ) అబ్దుల్ ఖాదర్ కొత్తగూడెం మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో ఏసీపీ అబ్దుల్ ఖాదర్‌ను సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవి కుమార్‌తో పాటు ఇతర ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

సిల్వర్ జూబ్లీ వేడుకలు

రాజేంద్రనగర్: వేము సాహితీ, సాంస్కృతిక సేవా సంస్థ ఆగస్టు నెల 11వ తేదీన 25 ఏళ్ల పూర్తయిన సందర్భంగా.. సిల్వర్ జూబ్లీ వేడుకలను నిర్వహించనున్నట్లు రచయిత, నటుడు, దర్శకులు, వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ వేము వందనం తెలిపారు. ఆగస్టు 11వ తేదీన సిల్వర్ జూబ్లీ వేడుకలను పురస్కరించుకొని రాజేంద్రనగర్ మండల స్థాయి పాఠశాలల విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలను నిర్వహించనున్నామన్నారు. సోలో పాటలు, సోలో నృత్యం, ఏకపాత్ర వాటిల్లో పోటీలను నిర్వహించనున్నామన్నారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన విద్యార్థులు ఆగస్టు 5వ తేదీ లోపు సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 8374333907 లో సంప్రదించాలన్నారు.

తహసీల్దారుకు ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ జి.సాగర్‌గౌడ్ తదితరులు

బండ్లగూడ: కార్పొరేషన్ పరిధిలోని పీరంచెరువు గంధంగూడ ప్రాంతాల్లోని సర్వే నెంబర్ 33,34లల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని మంగళవారం గండిపేట మండల తహసీల్దార్‌కు స్థానిక ప్రజలతో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సాగర్‌గౌడ్ మాట్లాడుతూ.. సర్వే నెంబర్ 33,34 లోని ప్రభుత్వ స్థలాన్ని గతంలో ఇందిరమ్మ గృహాల కోసం కేటాయించడం జరిగిందన్నారు. ఇప్పుడు కొంత మంది నాయకులు, వారి కుటుంబ సభ్యులు కలిసి ప్లాట్‌లలోని 160–175 వరకు కబ్జాలు చేసి నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. ప్రభుత్వ స్థలాలు పేద ప్రజలకు ఉపయోగపడాలి తప్ప, ఇలా అక్రమాలకు అప్పనంగా కట్టబెట్టవద్దు అన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరామన్నారు. ఆయన సానుకూలంగా స్పందించారని, ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో గంధంగూడ వాసులు పాల్గొన్నారు.

ధర్నా విఫలానికి ముందస్తు అరెస్టులు



ఏఐటీయూసీ కార్యదర్శి మల్లేష్‌ను ముందస్తు అరెస్ట్ చేసిన పోలీసులు

మణికొండ: రాష్ట్ర మున్సిపల్, ఆశ వర్కర్‌ల హక్కుల సాధనకు మంగళవారం ఇందిరా పార్కు వద్ద ధర్నా చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వమే అనుమతి ఇచ్చిందని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్. మల్లేష్ అన్నారు. అలాంటి ధర్నాలో పాల్గొనకుండా తమ యూనియన్, ఆశ వర్కర్‌ల సంఘం నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారని ఆయన తెలిపారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రతి ఒక్కరూ తమ నిరసన తెలుపుకునే హక్కులను రాష్ట్ర ప్రభుత్వాలు, పోలీసులు అణచివేస్తున్నారని, ఇదెక్కడి ప్రజాస్వామ్యమని మల్లేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇలాంటి అక్రమ అరెస్టులకు పాల్పడినందుకే, వారిని ప్రజలు ప్రతిపక్షానికి పరిమితం చేశారన్నారు. ఇలాంటి అరెస్టులతో తమ పోరాటాలను ఆపలేరని, రాబోయే రోజుల్లో మరింత ఉధృతంగా చేస్తామని అన్నారు.

మొదలైన నీటి సరఫరా

మణికొండ: రెండు సార్లు పైపులు పగిలి నిలిచిపోయిన నీటి సరఫరా ఎట్టకేలకు మరమ్మత్తులు పూర్తి చేసుకుని సరఫరా మొదలైంది. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలకు నీటి సరఫరా చేసే సింగూరు ప్రాజెక్టు నీటి పైపు నాలుగు రోజుల క్రితం ఖానాపూర్‌లో, రెండు రోజుల క్రితం పుప్పాలగూడలో పగిలిపోయిన విషయం తెలిసిందే. దీంతో వెంటనే మరమ్మత్తు పనులు చేపట్టిన జలమండలి ట్రాన్స్‌మిషన్ అధికారులు మంగళవారం ఉదయం వరకు పనులు పూర్తి చేసి, మధ్యాహ్నం తరువాత నీటి సరఫరాను పునరుద్ధరించారు. గతంలో డిమాండ్ ఎక్కువగా ఉండటంతో 10 ఎంజీడీ నీటిని తీసుకోవాల్సిన పైపులో 16 ఎంజీడీ వరకు నీటిని తీసుకున్నారు. దీంతో వాటిపై ఒత్తిడి ఏర్పడి తరచూ పగిలిపోయ్యాయి. ప్రస్తుతం వాటి సామర్థ్యానికి అనుగుణంగా 10 ఎంజీడీ నీటిని మాత్రమే సరఫరా చేయాలని నిర్ణయించారు. అయితే 6 ఎంజీడీల నీరు తగ్గటంతో, స్థానికంగా డిమాండ్ ఎక్కువగా ఉండటంతో ఏం చేయాలో తెలియని స్థితిలో జలమండలి అధికారులు ఉన్నారు. వచ్చే నీటినే సమయం తగ్గించి సరఫరా చేయాల్సి వస్తుందని వారు తెలిపారు. మంజీరా నీరు మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలతో పాటు షేక్‌పేట డివిజన్‌కు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం తక్కువగా వస్తుండటంతో షేక్‌పేటకు కృష్ణా నీటిని అధనంగా తీసుకుని, మంజీరా నీటిని మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలకే కేటాయించాలని ఉన్నతాధికారులను కోరారు. వారు స్పందించి అనుకూలంగా చర్యలు తీసుకుంటే నీటి సమస్య అంతగా రాదని, లేదంటే చాలి, చాలని నీటితో ఇబ్బందులు తప్పవని వారు వివరించారు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ జలమండలి ఎండీని కలిసి మంజీరా నీటిని రెండు మున్సిపాలిటీలకు మాత్రమే కేటాయించేలా చేయాలని జంట మున్సిపాలిటీల ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన శిక్షా సప్తాహ వేడుకలు



రాజేంద్రనగర్: శివరాంపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో శిక్షా సప్తాహ వేడుకలు మంగళవారం ఘనంగా ముగిశాయి. కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానం నాలుగో వార్షికోత్సవం పూర్తవుతున్న సందర్భంగా.. ఈ నెల 22 నుంచి 28 వరకు వారం రోజుల పాటు జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ రూపొందించిన కార్యచరణ ఘనంగా ముగిసింది. ఈ ముగింపు వేడుకలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పడమటి శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు. సభాధ్యక్షులు, హెడ్ మాస్టర్ కిషన్ మాట్లాడుతూ.. పాఠశాలల్లో వారం రోజులుగా కార్యక్రమాలు నిర్వహిస్తూ.. విజయవంతం చేయడానికి సహకరించిన ఉపాధ్యాయులకు ధన్యావాదాలు తెలిపారు. ఉపాధ్యాయులు నరసింహచారి, శ్రీధర్‌లు మాట్లాడుతూ.. పాఠశాలకు ట్రాన్స్‌ఫర్‌పై వచ్చిన ఉపాధ్యాయులు కొత్త, పాత అనే భేదం లేకుండా సహకరించడం అభినందనీయమన్నారు.

గోల్కొండ అమ్మవార్ల హుండీ ఆదాయం లెక్కింపు

గోల్కొండ: ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలకు ఈ సంవత్సరం అమ్మవారి దర్శనానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారని గోల్కొండ జగదాంబిక మహంకాళి ఆలయ కార్యనిర్వహణ అధికారి ఈ.శ్రీనివాసరాజు అన్నారు. అమ్మవారి 5, 6, 7 బోనం పూజల ఆదాయాన్ని మంగళవారం ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు పూజలకు కలుపుకోని రూ.3,22,236 ఆదాయం వచ్చిందన్నారు. ఇప్పటి వరకు జరిగిన ఏడు పూజల్లో అమ్మవారికి రూ.1004841 ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈ లెక్కింపులో అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షుడు బి.సాయిబాబాచారి, మహంకాళి ఆలయ పూజారి బి.సురేష్‌చారి, నర్సింగ్‌రావు, వినోద్, ఎల్లేష్ తదితరులున్నారు.

ఆక్రమణలను తొలగించండి

గచ్చిబౌలి: కాలనీల్లో అంతర్గత రహదారులపై ఆక్రమణలను తొలగించాలని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ పి.ఉపేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని బొటానికల్ గార్డెన్ రోడ్డు, చందానగర్ సర్కిల్ పరిధిలోని పీజేఆర్ ఎన్‌క్లేవ్, అపర్ణ రోడ్లను పరిశీలించారు. రహదారులను ఆక్రమించి ఫుట్‌పాత్‌లపై వెలసిన అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలన్నారు. రహదారులకు ఇరువైపుల పేరుకుపోతున్న చెత్త, గ్రీన్ వేస్టేజీను ఎప్పటికప్పుడు తరలించాలని వైద్యాధికారిని ఆదేశించారు. రహదారులపై ఏర్పడ్డ గుంతలను వెంటనే పూడ్చాలని, ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన డివైడర్లను ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులకు సూచించారు. బొటానికల్ గార్డెన్ ఎదురుగా ఉన్న గుడిసెలను తొలగించాలన్నారు. కార్యక్రమంలో డీసీ రజనీకాంత్ రెడ్డి, ఏసీపీ మెహర, ఏఎంఓహెచ్ డాక్టర్ కార్తీక్ డీఈ దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన డివిజన్ పరిధిలోని హుడా కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హుడా కాలనీలో కనీస వసతులు కల్పిస్తానని, మంజీరా పైప్‌లైన్ రోడ్డు సమస్యను త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. రోడ్డు మరమ్మతుల పనులు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ప్రజలు సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు.

వీధి కుక్కల బెడదను నివారించండి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చిన కౌన్సిలర్లు, కౌన్సిల్ సభ్యులు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో పెరిగిపోయిన వీధి కుక్కలతో ప్రజలు బయటకు వెళ్లేందుకు జంకుతున్నారని, వాటి బెడదను నివారించాలని మణికొండ మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్‌ను ది సిటిజన్స్ కౌన్సిల్ నాయకులు కోరారు. కౌన్సిలర్లు వసంతరావు, పద్మారావు, నవీన్‌కుమార్, శ్రీకాంత్‌స్వామిల ఆధ్వర్యంలో వారు మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అంతేకాకుండా మున్సిపాలిటీ పరిధిలో వీధి దీపాలు లేక అనేక కాలనీలలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వినాయక చవితిలోపు వాటిని ఏర్పాటు చేయించాలని కౌన్సిలర్లు కమిషనర్ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వీధి కుక్కల కట్టడికి ఇప్పటికే ప్రతి కుక్కకి రూ.1650లు ఖర్చు చేసి బ్లూక్రాస్ సొసైటీ ఆధ్వర్యంలోనే వాక్సిన్‌లు ఇప్పిస్తున్నామన్నారు. వినాయక చవితిలోపు అన్ని కాలనీలలో వీధిదీపాలను ఏర్పాటు చేస్తామన్నారు. కౌన్సిలర్లు చెప్పిన పనులకు స్పందించని సిబ్బందిని మార్చివేస్తామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ది సిటిజన్ కౌన్సిల్ కార్యదర్శి షేక్ ఆరీఫ్ మహమ్మద్, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌రావు, సహ కార్యదర్శి ఉపేంద్రనాథ్‌రెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను సిఫారసు చేయాలి



సదస్సును ప్రారంభిస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ: భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల సిఫార్సు విధానం అంశాలపై పరిశోధనలు సాగిస్తున్న దక్షణాది రాష్ట్రాలు, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర అఖిల భారత సమన్వయ పరిశోధన ప్రాజెక్టుల ప్రగతిని సమీక్షించడానికి రాజేంద్రనగర్‌లోని విస్తరణ విద్యా సంస్థలో మంగళవారం సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో పాల్గొన్న పరిశోధన సంచాలకులు పి. రఘురామిరెడ్డి మాట్లాడుతూ.. భావితరాలకు కాలుష్యరహిత వనరులను అందిస్తూ ఆహార ధాన్యాల ఉత్పత్తిలో నెలకొన్న స్తబ్దతను అధిగమిచాలని సూచించారు. దీర్ఘకాలిక ఎరువుల విధానం, జీవన ఎరువులు, సూక్ష్మపోషకాలు, భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను సిఫారసు చేయాలని అన్నారు. జమ్ములోని షేర్–ఇ–కాశ్మీర్ (యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ టెక్నాలజీ) వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ ఉప కులపతి డాక్టర్ పీకే. శర్మ చైర్మన్‌గా ఏర్పాటైన ఎనిమిది మంది సభ్యుల బృందం భారత మృత్తికా శాస్త్ర సంస్థ భోపాల్ ఆధ్వర్యంలో ఈ సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మృత్తికా యాజమాన్య సంస్థ, దీర్ఘకాలిక ఎరువుల యాజమన్య విభాగం, వ్యవసాయ పరిశోధన స్థానం జగిత్యాల వారు రూపొందించిన ప్రచురణల్ని విడుదల చేశారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో ఐదు అఖిల భారత సమన్వయ పరిశోధన ప్రాజెక్టుల సమన్వయకర్తలు డాక్టర్ శ్రీవాత్సవ, డాక్టర్ బెహారా, డాక్టర్ వంజరి, డాక్టర్ మహంతి, బిశ్వాస్‌తో పాటు దక్షణ తెలంగాణ మండల సహపరిశోధన సంచాలకులు డాక్టర్ మల్లారెడ్డి, మృతికా ఆరోగ్య యాజమాన్య సంస్థ అధికారి మాధవి పరిశోధన శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

సాధారణ కౌన్సిల్ సమావేశం



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ మద్దెల లతాప్రేమ్‌గౌడ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. కార్పొరేషన్ కమిషనర్ మేయర్ మద్దెల లతాప్రేమ్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు అభివృద్ధి పనులకు రూ.1615.35 లక్షల రూపాయలను ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించారు. సీసీ రోడ్డు పనులకు రూ.765.35 లక్షలు, యూజీడీలు రూ.54 లక్షలు, బీటీ రోడ్లకు రూ.60 లక్షలు, పార్కులు, ఆట వస్తువులకు రూ.30 లక్షలు, కమ్యూనిటీహాల్స్ అభివృద్ధి కోసం రూ.155 లక్షలు, శ్మశానవాటికలు రూ.30 లక్షలు, ఇతర పనుల కోసం రూ.521 లక్షలు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ప్రజా అవసరాలను గుర్తించి వారికి మెరుగైన సదుపాయాలను కల్పించేందుకు ఎప్పటికప్పుడు కౌన్సిల్ సమావేశాలను ఏర్పాటు చేసి నిధులను ప్రవేశపెడుతున్నామన్నారు. అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, కమీషనర్ బి.శరత్‌చంద్ర, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, జల మండలి అధికారులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులను ప్రారంభించిన కౌన్సిలర్



డ్రైనేజీ పనులను ప్రారంభించిన కౌన్సిలర్

మణికొండ: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరణ చేస్తున్నామని నార్సింగి మున్సిపాలిటీ 6వ వార్డు కౌన్సిలర్ పత్తి శ్రీకాంత్‌రావు అన్నారు. మంగళవారం ఆయన తన వార్డు పరిధిలోని ముప్పా మున్సిపాలిటీ నుంచి మంజూరు అయిన రూ. 35లక్షల నిధులతో డ్రైనేజీ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో వస్తున్న గేటెడ్ కమ్యూనిటీలతో జనావాసం భారీగా పెరుగుతుందని, వారికి రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి వ్యవస్థ కల్పించాల్సి వస్తుందన్నారు. మున్సిపాలిటీ నిధులతో అన్ని పనులను చేపడుతున్నామన్నారు. తన వార్డు పరిధిలో బోరు, మోటార్‌ను బాగుచేయించి నీటి సమస్యను పరిష్కరించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్‌లను సందర్శించిన సీఎండీ



తనిఖీలు చేస్తున్న చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫారూఖీ

రాజేంద్రనగర్: క్షేత్రస్థాయి తనిఖీల్లో భాగంగా మంగళవారం దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫారూఖీ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని వివిధ సబ్ స్టేషన్‌లను సందర్శించారు. విద్యుత్ సరఫరా తీరు తెన్నులను, ఫీడర్ సర్వే వంటి విషయాలను పరిశీలించిన సీఎండీ.. శంషాబాద్ పట్టణంలో ధర్మసాయి సబ్ స్టేషన్‌లో అదనంగా ఏర్పాటు చేసిన 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్స్‌ను ప్రారంభించారు. ఈ పర్యటనలో సీఎండీతో పాటు రంగారెడ్డి జోన్ చీఫ్ ఇంజనీర్ పి.ఆనంద్, సూపరింటెండింటింగ్ ఇంజనీర్ ఎల్.గోపయ్య, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.